
సాక్షి ఒడిశా

శనివారం । 6 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ.1,16,927

వెండి: 44 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

జనాభాపరంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ పట్టణంలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలకు కల్పించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక సూచించారు.

- 8లో.



మొక్కలతోనే మానవ మనుగడ

మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు.

- 8లో.

న్యూస్‌రీల్

సేవా పేపర్ మిల్లు విశ్రాంత కార్మికుల ఆందోళన



ఆందోళన జరుపుతున్న ఇద్దరు విశ్రాంత శ్రామికులు

జయపురం: తమ దీర్ఘకాల డిమాండ్ల సాధనకు సేవా పేపరు మిల్లు విశ్రాంత శ్రామికులు మిల్లు ప్రధాన గేటు ముందు ఆందోళన చేపట్టారు. ఎంతో కాలంగా తమ గోడు విననందుకు నిరసనగా వినూత్న రీతిలో వారు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ (బీటీఏ) ప్రకారం పీఎఫ్, పెన్షన్, గ్రాచ్యుటీ, బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రతిరోజూ ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఇద్దరు విశ్రాంత శ్రామికులు ఆందోళన జరుపుతారని శ్రామిక సంఘ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి వెల్లడించారు. సీఎం మోహన్ చరణ్ మాఝి బహిరంగ దర్బారులో సాధారణ ప్రజల సమస్యలు వింటున్నారని, ఆయనకు తమ సమస్యలు తెలియాలనే ఆకాంక్షతో ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. మిల్లులో 5,500 టన్నుల పేపరు ఉత్పాదన అయితే అన్ని బకాయిలు చెల్లిస్తామని మిల్లు యాజమాన్యం చెపుతున్నదని, అయితే అది ఎప్పుడు అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఆందోళనలో విశ్రాంత శ్రామికుడు ధ్రుభ బారిక్, రబీంద్ర కుమార్ మహారాణలు పాల్గొన్నారు. వారికి మద్దతుగా ప్రమోద్ కుమార్, మహంతి, బసంత బెహర, భాస్కర మిశ్ర, ప్రహ్లాద్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

రాయగడ: కారులో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గుణుపూర్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గజపతి జిల్లాలోని అత్తలిమ్మ గ్రామానికి చెందిన ఆశిష్ కుమార్ బీరో, అదే జిల్లాలోని తబరసాహి గ్రామానికి చెందిన జయంత్ గొమాంగొలు ఉన్నారు. నిందితుల నుంచి 60.760 కిలోల గంజాయితో పాటు రూ.1,900 నగదు, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎప్పటిలాగే గుణుపూర్ సమీపంలోని ఖరలింగి కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గుణుపూర్ నుంచి పర్లాకిమిడి వైపు వెళుతున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు తరలించారు.

యువతీ, యువకుడిపై సామూహిక దాడి



వదిలేయాలని వేడుకుంటున్న యువకుడు

కొరాపుట్: యువతీ, యువకుడి కళ్లకు గంతలు కట్టి గ్రామం మధ్యలో కుటుంబ సభ్యులు విచక్షణ రహితంగా దాడిచేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన యువతి భర్తతో గొడవలు కారణంగా కన్నవారింట్లో ఉంటోంది. అదే సమయంలో ఆమె జొరిగాంకి చెందిన యువకుడితో సన్నిహితంగా మెలిగేది. ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులు పసిగట్టి, యువకుడు ఆమెను కలవడానికి గ్రామానికి వచ్చిన సమయంలో పట్టుకున్నారు. అనంతరం వీరిద్దరినీ గ్రామం మధ్యకి తీసుకొచ్చి కళ్లకి గంతలు కట్టి కర్రలతో దాడిచేశారు. కర్రలు విరిగేటట్లు కొట్టడం, కాలితో తన్నడం జరిగింది. ఈ ఘటనను ఒక యువకుడు తన సెల్‌ఫోన్‌లో వీడియో తీయడంతో వైరల్‌గా మారింది. దీనిపై నబరంగ్‌పూర్ జిల్లా ఎస్పీ రోహిత్ వర్మ మాట్లాడుతూ ఈ ఘటనపై పూర్తి దర్యాప్తు చేస్తామన్నారు.

• ముమ్మరంగా ఖరీఫ్ పనులు



ఏరువాక జరుగుతున్న దృశ్యం

నబరంగ్‌పూర్ జిల్లాలో ఈ ఏడాది అనుకున్న సమయానికి సక్రమంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికారుల అంచనా ప్రకారం జూన్‌లో కేవలం 7 శాతం వర్షం తక్కువగా పడింది. ఈ లోటు పెద్ద నష్ట ప్రభావం చూపించదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ జిల్లాలో కేవలం వర్షాధారిత వ్యవసాయం జరుగుతుంది. జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టులు లేకపోవడంతో లక్షలాది మంది రైతులు వర్షపు నీటిపైనే అధారపడుతున్నారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వలన పంట పొలాలు కళకళలాడుతున్నాయి. దీంతో మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి.

– కొరాపుట్



పొలం పనుల్లో రైతులు



నీటితో నిండిన వ్యవసాయ క్షేత్రాలు

శ్రీమందిరం

ఉద్వాసన..!



- రత్న భాండాగారం కమిటీ రద్దు
- కొత్త కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- నేడు తేదీ నిర్ణయించే అవకాశం..?

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ దేవాలయంలోని రత్న భాండాగారంలో పదిలపరిచిన విలువైన నగలు, ఆభరణాలు, వస్తువుల పరిశీలన, జాబితా రూపకల్పన కోసం గత బిజూ జనతా దళ్ హయాంలో ఏర్పాటు చేసిన కమిటీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. దాని బదులుగా ఒడిశా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రాత్ అధ్యక్షతన కొత్త కమిటీని పునర్నియమించారు. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ), గజపతి మహారాజా, పూరీ కలెక్టర్‌ల ప్రతినిధులతో సహా మరో 15 మంది సభ్యులతో కొత్త కమిటీ ఏర్పాటైనట్లు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మీడియాకు శుక్రవారం వివరించారు. శ్రీజగన్నాథ ఆలయ ప్రధాన పాలనాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. రత్న భాండాగారంలో భద్రపరిచిన ఆభరణాలతో సహా విలువైన వస్తువులను పరిశీలించేందుకు జస్టిస్ బిస్వనాథ్ రథ్ అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని పునర్నియమించినట్లు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడే తొలి సమావేశం

పూరీలో కొత్త కమిటీ శనివారం సమావేశమై రత్న భాండాగారం తెరిచే తేదీని నిర్ణయిస్తుంది. లోపలి గది మరమ్మతులు మరియు దానిలో నిల్వ చేసిన విలువైన వస్తువుల జాబితాకు సంబంధించిన విధివిధానాలను సిద్ధం చేయనున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. శ్రీమందిరం ఖజానాలో భద్రపరిచిన విలువైన వస్తువుల నాణ్యతను పరిశీలించేందుకు ఏ బాహ్య ఏజెన్సీలను చేర్చుకోవాలో కూడా ప్యానెల్ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో గత బీజేడీ ప్రభుత్వం ఒరిస్సా హైకోర్టు ఆదేశాల మేరకు రత్న భాండాగారంలో పదిల పరచిన నగలు మరియు ఇతర విలువైన వస్తువుల జాబితాను పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్ నేతృత్వంలో 12 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న రత్న భాండాగారం తెరవడం కోసం రాష్ట్ర ప్రజలు దీర్ఘకాలంగా నిరీక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆమోదంతో ఒరిస్సా హైకోర్టు ఆదేశాల మేరకు త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభం అవుతుందని మంత్రి ఉద్ఘాటించారు. 45 ఏళ్ల తర్వాత రత్న భాండాగారం తెరవబడుతుందన్నారు. ఒరిస్సా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ నేతృత్వంలో సమర్థవంతమైన 16 మంది సభ్యులతో ఏర్పాటైన కమిటీ దీనిపై పని చేస్తుందని వెల్లడించారు. శ్రీజగన్నాథ ఆలయ పాలన అధికారి కార్యాలయంలో ఈ సమావేశం జరగనుంది. కమిటీ సమావేశానికి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

కొత్త కమిటీ
అధ్యక్షుడు జస్టిస్ బిశ్వనాథ్ రథ్
సభ్యులు
డాక్టర్ సి.బి.కె.మహంతి
రాజీబ్ సాహు (సీఏ)
జగదీష్ మహంతి (విశ్రాంత ఐఏఎస్)
ప్రకాష్ మిశ్రా (విశ్రాంత ఐపీఎస్)
స్వామి ప్రజ్ఞానంద జీ
హరిహర హత్తా
పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్
గజపతి మహారాజా ప్రతినిధి
భారత పురావస్తు శాఖ ప్రతినిధి
మధుసూదన్ సింఘారి
జగన్నాథ పటజోషి మహాపాత్రో
జగన్నాథ దాస్ మహాపాత్రో
సౌమేంద్ర ముదులి
పూరి జిల్లా కలెక్టర్
శ్రీ మందిరం ప్రధాన పాలనాధికారి

కమిటీ రద్దు వెనక ఉద్దేశమేంటి: ప్రమీలా మల్లిక్

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని రద్దు చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశమేమిటని బీజేడీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష విప్ ప్రమీలా మల్లిక్ ప్రశ్నించారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రకటనల్లో పొంతన లేదని దుయ్యబట్టారు. రత్న భాండాగారం తెరవడంపై ప్రభుత్వానికి స్పష్టమైన వైఖరి కొరవడిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలను ఉలిక్కిపడేలా చేస్తున్నారని మండిపడ్డారు. వారి ఉద్దేశాలు మంచిగా ఉంటే జస్టిస్ అరిజిత్ పసాయత్ వంటి న్యాయ నిపుణుడి నేతృత్వంలోని ప్యానెల్‌ను వారు రద్దు చేసి ఉండేవారు కాదన్నారు.

ఆరోపణలు సిగ్గుచేటు: మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

కమిటీ రద్దుపై బీజేడీ ఆరోపణలు సిగ్గుచేటని మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తిప్పికొట్టారు. బీజేడీ ప్రభుత్వం 24 ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ శ్రీమందిరం రత్న భాండాగారం తెరవలేకపోయిందన్నారు. వారు ఆభరణాలు ఇతరేతర సొత్తు వివరాల వెల్లడి పనిని చేపట్టలేకపోయారని మండిపడ్డారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన 20 నుంచి 25 రోజుల స్వల్ప నిడివిలో కొత్త ప్రభుత్వం ఈ చర్యని ప్రారంభించే తేదీని నిర్ణయించడానికి ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. జాబితా రూపకల్పన ఖరారు కావడంతో ప్రతీ వస్తువు డిజిటల్ ఫొటో భద్రపరచబడుతుందని, ఒక కేటలాగ్ తయారు చేయబడుతుందని వెల్లడించించారు. ఇది రాబోయే 50 సంవత్సరాలకు ఆలయ పరిపాలనకు సూచన పత్రంగా మారుతుందని వివరించారు.

ముటుకునిలో సమస్యల విలయ తాండవం

- పెన్షన్, రేషన్‌కు పది కిలోమీటర్ల నడిచి వెళ్లాల్సిందే



ముటుకుని గ్రామం



పెన్షన్, రేషన్ బియ్యం కోసం నడిచి వెళ్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పద్మపూర్ సమితి డెరింగా పంచాయతీలోని ముటుకుని గ్రామంలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. గ్రామంలో కనీస మౌలిక సౌకర్యాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సుమారు 20 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామంలో దాదాపు వందమందికి పైగా జనాభా ఉన్నారు. ఇంతవరకు ఈ గ్రామానికి రహదారి సౌకర్యం, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు ప్రభుత్వం ఇంతవరకు కల్పించలేదు. ఇంతవరకు ఈ గ్రామంలో అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ కాలు పెట్టిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని వాగు నీరే వీరికి శరణ్యమవుతోంది. కనీసం ఒక్క గొట్టపుబావి కూడా ఈ గ్రామంలో లేకపోవడం విచారకరం. కలుషితమైన వాగు నీటిని తాగి ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్య సౌకర్యాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. పెన్షన్, ఉచిత బియ్యం కోసం కనీసం పది కిలోమీటర్ల దూరంలోని పంచాయతీకి నడిచి వెళ్లాల్సి వస్తోంది. అదీ కొండలు, గుట్టలు దాటి సుమారు రెండు గంటల పాటు నడవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని కొలువుదీరిన కొత్త ప్రభుత్వమైనా తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

'అమరేష్ బదిలీని రద్దు చేయాలి'



డిప్యూటీ కలెక్టర్ మండల్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

రాయగడ: భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంస్థగా గుర్తింపు పొందిన ఆల్ ఇండియా మెడికల్ సేల్స్ అండ్ రిప్రెజెంటేటివ్ అసోసియేషన్ సాధారణ కార్యదర్శిగా విధులు నిర్వహించే అమరేష్ మహాపాత్రో బదిలి రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ నాయకులు శుక్రవారం ముఖ్యమంత్రి పేరట ఒక వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయానికి సమర్పించారు. ఆ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జోగేశ్వర్ దాస్ నేతృత్వంలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం కూడలి నుంచి ర్యాలీగా వెళ్తూ వినతి పత్రాన్ని డిప్యూటీ కలెక్టర్ లలిత్ మండల్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా మహాపాత్రో లిపున్ లిమిటెడ్ అనే సంస్థలో మెడికల్ సేల్స్ రిప్రెజెంటేటివ్‌గా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అయితే లిపున్ సంస్థ యాజమాన్యం మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురిచేసి అతనిని ముంబాయికి బదిలీ చేయడం కార్మిక చట్టం ప్రకారం వ్యతిరేకమని వివరించారు. ఉద్దేశపూర్వక బదిలీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈ ఆందోళన చేపట్టామని వివరించారు.

ఐఈడీ నిర్వీర్యం చేసిన బీఎస్‌ఎఫ్



మావోయిస్టులకు చెందిన ఐఈడీ టిఫిన్ బాంబు

కొరాపుట్: మావోయిస్టులు ఏర్పాటు చేసిన టిఫిన్ బాక్స్ ఐఈడీని బీఎస్‌ఎఫ్ దళాలు నిర్వీర్యం చేశాయి. కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఒనక ఢిల్లి గ్రామ పంచాయతీ కడంగుడ గ్రామ పరిధి అటవీ ప్రాంతంలో డంప్‌ని శుక్రవారం గుర్తించారు. అక్కడ రెండు ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశారు. సంఘటన ప్రాంతంలో మావోయిస్టుల పాత బ్యానర్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌ని 65వ బెటాలియన్ పరిధిలో పూర్తి చేసినట్లు బీఎస్‌ఎఫ్ వర్గాలు ప్రకటించాయి.

సెంచూరియన్ వర్సిటీలో వర్క్‌షాపు



మాట్లాడుతున్న వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ విద్యాదర్ సుబుద్ధి

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం కట్టింగ్ ఎడ్జ్ అడ్వాన్స్‌మెంట్‌పై ఐదు రోజుల పాటు జాతీయ స్థాయిలో వర్క్‌షాపు జరిగింది. ఈ వర్క్‌షాపును రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో ప్రారంభించగా, డీన్ డా.ప్రఫుల్ల కుమార్ పండా శాస్త్రీయవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ విద్యాదర్ సుబుద్ధి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీని సూర్యరశ్మి, విండ్ ద్వారా ఎలా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చో వివరించారు. ఈ వర్క్‌షాపును అంతర్జాతీయ ఈఈఈ సాంకేతికంగా స్పాన్సర్ చేయగా ఐఐటీ, ఎన్ఐటీలు, ఇతర ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ప్రతినిధులు విచ్చేసి తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రభాత్ కుమార్ పట్నాయక్, డాక్టర్ ప్రజ్ఞా ప్రణీత ప్రధాన్, డా.అవినాష్ రథ్ తదితరులు పాల్గొన్నారు.

హిరాఖండ్ రైలుకి అదనపు బోగీ



హిరాఖండ్ రైలు

కొరాపుట్: జగదల్‌పూర్ – కొరాపుట్ – భువనేశ్వర్‌ల మధ్య నడిచే హిరాఖండ్ రైలుకి అదనపు బోగి ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. శుక్రవారం నుంచి ఈ బోగి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నదని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటించారు. 18447 నంబర్‌తో భువనేశ్వర్-జగదల్‌పూర్‌ల మధ్య, 18448 నంబర్‌తో జగదల్‌పూర్-భువనేశ్వర్‌ల మధ్య ఈ రైలు నడుస్తుంది. ప్రస్తుతం 15 బోగీలు ఉన్న ఈ రైలు, ఇకపై 16 బోగీలతో ఉంటుందది. మెత్తం జనరల్ బోగిలు ఇకపై 4కి పెరుగుతాయి. ఎల్‌హెచ్‌బీ కోచ్ కావడంతో అదనంగా సుమారు 100 సీట్లలో జనరల్ ప్యాసింజర్‌లకు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కొరాపుట్ జిల్లాల నుంచి రాజధాని భువనేశ్వర్‌కు నడిచే ఒకే ఒక రైలు కావడంతో ఈ రైలుపై ప్రజల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది.

పూరీకి మూడు రైళ్లు

రథయాత్ర పురస్కరించుకొని కొరాపుట్ జిల్లాల నుంచి పూరీకి మూడు అదనపు రైళ్లని రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. ఈనెల 6వ తేదీన 08349 నంబర్ కలిగిన రైలు ఉదయం 10.45 గంటలకి జగదల్‌పూర్ నుంచి బయల్దేరి మర్నాడు 7వ తేదీ 0.45 గంటలకు పూరీ చేరుతుంది. ఈ రైలు కోట్‌పాడ్, జయపూర్, కొరాపుట్, దమంజోడి, లక్ష్మీపూర్, టికిరి, రాయగడ, పార్వతీపురం, విజయనగరం మీదుగా పూరీ చేరుకుంటుంది. తిరిగి 8వ తేదీన 08350 నంబర్ గల ట్రైన్ పూరీలో అర్ధరాత్రి 01.45కి బయల్దేరి, సాయంత్రం 3.10కి జగదల్‌పూర్ చేరుకుంటుంది. మరలా హీరా పంచమి సందర్భంగా 14వ తేదీన జగదల్‌పూర్‌లో ఉదయం 10.45కి బయల్దేరి 15వ తేదీన 0.45కి పూరీ చేరుకుంటుంది. హీరా పంచమి ముగిసిన తర్వాత 16న పూరీ నుండి అర్ధరాత్రి 0.15కి బయల్దేరి, అదేరోజు జగదల్‌పూర్‌కు సాయంత్రం 3.10కి చేరుకుంటుంది. మారు రథయాత్ర (బహుడా) కోసం 16వ తేదీన జగదల్‌పూర్ నుంచి బయల్దేరి 17వ తేదీ వేకువ జామున చేరుతుంది. మరలా 18న పూరీ నుంచి బయల్దేరి సాయంత్రంకి జగదల్‌పూర్ చేరుకుంటుంది.



అదనపు బోగి కోసం రైల్వే శాఖ విడుదల చేసిన లేఖ

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

టెక్కలి రూరల్: టెక్కలి నౌపడ రోడ్డులో గల శ్రీ రాజరాజేశ్వరి గోల్డ్‌షాపులో జూన్ 17వ తేదీన మూడు బంగారపు గొలుసులు చోరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు కేసునమోదు చేసి విచారణ చేపట్టారు. ఆ చోరీకి పాల్పడిన గందుపల్లి రాజేష్‌తో పాటుగా మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గొలుసులు రికవరీ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ-2 తెలిపారు.

అనారోగ్యంతో తహసీల్దార్ మృతి

పాతపట్నం: పాతపట్నం హనుమాన్ నగర్‌లో నివాసం ఉంటున్న తహసీల్దార్ జలారి చలమయ్య(52) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఎన్నికల ముందు సంతబొమ్మాళి మండలం తహసీల్దార్‌గా పనిచేసి, ఎలక్షన్ బదిలీలో భాగంగా రంపచోడవరం తహసీల్దార్‌గా వెళ్లారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం ఉదయం పాతపట్నంలో అంత్యక్రియలు కుటుంబసభ్యులు నిర్వహించారు. మెళియాపుట్టి మండలం నందవ కొత్తూరు ఆయన స్వగ్రామం. గతంలో మెళియాపుట్టి, పాతపట్నం (ఇన్‌చార్జి)తహల్దార్‌గా పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చలమయ్య మృతిపై పలువురు రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నందిగాం: మండలంలోని కొత్తగ్రహారం పంచాయతీ జడ్యాడ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్యాడ వద్ద ఉన్న వంశధార కాలువలో పూడికలు తీసివేయడం పూర్తి కావడంతో అక్కడి పొక్లెయినర్‌ను వేరే చోటకు తరలించేందుకు కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన డ్రైవర్ దాట్ల రాము, క్లీనర్ అత్తిని వెంకటరావు(36)తో కలిసి లారీ పెట్టారు. లారీపై పొక్లెయినర్ పెట్టాక జడ్యాడ నుంచి మెళియాపుట్టి రోడ్డు వైపు వస్తుండగా విద్యుత్ తీగలు కిందకు వేలాడి ఉండడం గమనించిన డ్రైవర్ మిషన్‌కు తగులుతాయని గుర్తించి క్లీనర్‌కు చూడమని చెప్పాడు. దీంతో క్లీనర్ వెంకటరావు మీదకు ఎక్కి చెబుతుండగా విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టింది. వెంటనే ఆయనను పొక్లెయినర్ యజమాని కల్యాణ్ మరో వ్యక్తి కలిసి బైక్ మీద టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో వచ్చిన 108 వాహనంలో టెక్కలి ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రికి చేరేలోపే వెంకటరావు మృతి చెందాడు. మృతునికి భార్య జ్యోతి, పదేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేశారు.

రెండు ఇసుక లారీలు సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక లారీలను ఎచ్చెర్ల పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. పొన్నాడ పంచాయతీ ముద్దాడపేట ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా విశాఖపట్నం ఇసుక తరలిస్తుండగా బైపాస్ కూడలి వద్ద ఒకటి, పొన్నాడ వద్ద మరో లారీని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఏఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలకు అందుబాటులో న్యాయ సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కారాగారంలో ఉండే ఖైదీలకు న్యాయపరమైన సలహాలు, న్యాయ సేవలు అందించాలని జిల్లా న్యాయసేవాధి కార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం జైలులో ఉన్న ఖైదీలకు న్యాయ సహాయంపై న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఖైదీలకు బెయిల్ మంజూరు చేసే క్రమంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కలిగించాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. మోటారు వాహన చట్టాలు, అతిక్రమిస్తే చేపట్టే చర్యలపై అవగాహన పెంచాలన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలతో వ్యాపారాభివృద్ధి

టెక్కలి: మత్స్య సహకార సంఘాల్లో ఉన్న సభ్యులతో రైతు ఉత్పత్తిదారులు సమాఖ్యలుగా ఏర్పడి తద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుని వ్యాపారాభివృద్ధి చేసుకోవాలని మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ సూచించారు. టెక్కలి మత్స్యశాఖ కార్యాలయంలో శుక్రవారం టెక్కలి, వడ్డితాంద్రకు చెందిన జగన్నాథ మత్స్యకార సొసైటీకి చెందిన స్వదేశీ మత్స్యకారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వంద మంది సభ్యులతో ఈ సమాఖ్యలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. దీని వల్ల సమాఖ్యలో ఉన్న సభ్యులకు ఆర్థిక స్వావలంబన కలుగుతుందని అంతే కాకుండా వ్యాపారాలను మరింత విస్తరించవచ్చునని ఏడీ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ ధర్మరాజు, సహాయకుడు బి.మధు, సభ్యులు పద్మనాభం, కార్తీక్ బెహరా, హేరంబో, గోపి బెహరా, హన్నురావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: ఎస్‌కేసీజీ కళాశాలలో వన మహోత్సవంలో పాల్గొన్న డీఎఫ్‌వో ఆనంద్, అధ్యాపక బృందం



కొరాపుట్: నబరంగ్‌పూర్ మహా విద్యాలయంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



జయపురం: మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొక్కలతోనే మానవ మనుగడ

మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తున్నట్లు వెల్లడించారు. భువనేశ్వర్‌లోని దుమ్‌దుమా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన మొక్కలు నాటారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వన మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలని పిలుపునిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్





భువనేశ్వర్: వన మహోత్సవంలో ప్రసంగిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి, మొక్క నాటుతున్న సీఎం మోహన్ చరణ్



పర్లాకిమిడి: కళాశాలలో మొక్కలను నాటుతున్న డీఎఫ్‌వో ఆనంద్ తదితరులు



రాయగడ: మొక్కలు నాటే కార్యక్రమంలో మహిళలు



రాయగడ: మొక్కలు నాటుతున్న మంజులా మినియాక

ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

- ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక
- నజావుగా మున్సిపల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడ్రక, చైర్మన్ పట్నాయక్ తదితరులు

రాయగడ: జనాభాపరంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ పట్టణంలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలకు కల్పించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కడ్రక సూచించారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మహేష్ పట్నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరమైన కడ్రక పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పట్టణంలో జనాభా పెరుగుతున్నా అందుకు అనుగుణంగా సౌకర్యాలు లేవన్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిపాటి వర్షాలకే పట్టణంలోని డ్రైనేజీలు నిండిపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహించి, దుర్గంధం వెలువడుతోందన్నారు. గత ఐదేళ్లలో మున్సిపాలిటీ యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రత్యేకంగా ఒక సమీక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. ఆ సమావేశం అనంతరం పట్టణంలో విస్తృతంగా పర్యటించి చేపట్టిన నిర్మాణ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్వయంగా పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

పట్టణంలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ అన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ వార్డుల కౌన్సిలర్లు

గతేడాది మున్సిపాలిటీ యంత్రాంగం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమావేశంలో నివేదికను చదివి వినిపించారు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. 24 వార్డులకు గాను ఇప్పటికే 10 వార్డుల్లో సర్వేను చేపట్టామని, త్వరలో మిగతా వార్డుల్లో సర్వే పూర్తయితే, మాస్టర్ ప్లాన్ ప్రకారం డ్రైనేజీ వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడించారు.

పట్టణంలో స్వాగత ద్వారాలు

పట్టణానికి నాలుగు వైపులా మున్సిపాలిటీ తరుపున భారీ స్వాగత ద్వారాలను నిర్మించేందుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించడమైనదని చైర్మన్ పట్నాయక్ ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న మున్సిపాలిటీ కార్యాలయం చాలా పురాతనమైపోయిందని, అందువల్ల మూడంతస్తులతో కొత్త కార్యాలయం నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇప్పటికే పంపించామన్నారు.

రోడ్లకు ఇరువైపులా దుకాణాలు తొలగింపు

పట్టణంలోని ప్రధాన ప్రాంతమైన గుండిచా మందిరం నుంచి సరళా కూడలి వరకు రోడ్లపై చిన్న చిన్న దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ఈ నేపథ్యంలో ఆయా దుకాణాలను ఎత్తివేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు సన్నహాలు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే సరళా కూడలిలో మున్సిపాలిటీ నిర్మించిన మార్కెట్ యార్డుకు కూరగాయల వ్యాపారస్తులను తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. దీంతో ట్రాఫిక్‌కు మార్గం సుగమవుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న బిజూ పట్నాయక్ కల్యాణ మండపం, అశోక్ కల్యాణ మండపాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానించడం జరిగిందని తెలియజేశారు. అవసరమైతే వాటిని విరగ్గొట్టి అధునాతన సౌకర్యాలతో కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదిస్తామన్నారు.

మురికివాడల ప్రజలకు అండగా

మున్సిపాలిటీ పరిధిలోని మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలకు అండగా నిలిచేందుకు మున్సిపాలిటీ యంత్రాంగం తగు చర్యలు తీసుకునేందుకు నిర్ణయించిందని చైర్మన్ పట్నాయక్ అన్నారు. పట్టణంలో ఇప్పటికే గుర్తించిన మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలు రానున్న వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా తాత్కాలిక వసతులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సౌమ్యరంజన్ మిశ్రా, వైస్ చైర్మన్ శుభ్ర పండ, 24 వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చంద్రపూర్ తహసీల్దార్ అరెస్టు



బిచిత్రానంద నాయక్ (ఫైల్)

రాయగడ: ఒక లబ్ధిదారుడి నుంచి లంచం తీసుకొని ఆ మొత్తం సొమ్ముతో రాయగడకు వస్తున్న చంద్రపూర్ తహసీల్దార్ బిచిత్ర నంద నాయక్‌ను రాయగడ విజిలెన్స్ అధికారులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని చంద్రపూర్ సమితిలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బిచిత్ర నంద ఒక లబ్ధిదారుడికి లంచం అడిగారు. ఆ మొత్తం లంచం డబ్బులను తీసుకుని రాయగడకు వస్తుండగా రాయగడ విజిలెన్స్ అధికారులు సమాచారం అందుకుని వెంబడించారు. విజిలెన్స్ అధికారులు వెంబడిస్తున్నట్లు గుర్తించిన నందో ఆ మొత్తం సొమ్మును ఒక పొదలోకి విసిరేశాడు. ఎలాగోలా వారి నుంచి తప్పించుకుని రాయగడకు చేరుకున్న నందో స్థానికంగా ఉన్నటువంటి ఒక హోటల్‌లో బస చేశాడు. అనంతరం సాయంత్రం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాడు. ఈ సమాచారం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. అధికారులను చూసిన నందో ఒక మరుగుదొడ్డిలో దాగుండిపోయాడు. అది గమనించిన అధికారులు అతనిని అరెస్టు చేసి విజిలెన్స్ కార్యాలయానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా విజిలెన్స్ అధికారులు తరుముతున్నారని విసిరేసిన డబ్బుల సంచిని స్వాధీనం చేసుకున్న అధికారులు ఆ మొత్తం సొమ్ము రూ.1.15 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఎవరి నుంచి లంచం తీసుకున్నారనే వివరాలు తెలియాల్సి ఉంది.

రథయాత్ర యానిమేషన్ చిత్రం



రథాసీనుడైన శ్రీజగన్నాథునిపై పూలవాన కురిపిస్తున్న దేవతల సైకత యానిమేషన్

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరి నిత్య దర్శనం కల్పించే శ్రీజగన్నాథుడు ఏడాదికోసారి భక్తజనం మధ్యకి ప్రత్యక్షంగా ప్రవేశించడం అత్యంత అపురూపం. రథాసీనుడైన స్వామివారిని సర్వ మానవాళితో పాటు పశు పక్షాదులు, దేవ దానవులు కనులారా తిలకించి మురిసిపోయే అమృత ఘడియలు దగ్గర పడుతున్నాయి. రథంపై ఆసీనుడైన స్వామిని దర్శించుకునే దేవతలు పూల వర్షం కురిపిస్తారనే సమగ్ర ఇతివృత్తంగా ప్రసిద్ధ సైకత యానిమేటర్ మానస కుమార్ సాహు అపురూపమైన రథయాత్ర దృశ్యాన్ని ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా భక్త జనానికి రథయాత్ర శుభాకాంక్షలు తెలిపాడు. 2 రోజులు నిర్విరామంగా శ్రమించి 2 నిమిషాల 40 సెకన్ల నిడివితో ఈ యానిమేషన్ వీడియో చిత్రీకరణ జరిగిందని వివరించాడు.



యానిమేషన్ రూపొందిస్తున్న కళాకారుడు మానస కుమార్ సాహు

'గత ప్రభుత్వ అక్రమాలపై దర్యాప్తు చేయండి'

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపి నాయకుడు అర్జున్ త్రిపాఠి డిమాండ్ చేశారు. శుక్రవారం నబరంగ్‌పూర్ మెయిన్ రోడ్డులోని ఒక హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. గత ప్రభుత్వంలో 5టీ నిధులతో నిర్మించిన స్కూల్స్ నిర్మాణం టెండర్లు లేవన్నారు. విజిలెన్స్ వలలో చిక్కుకున్న మాజీ సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌రౌత్ హయాంలో జరిగిన భూ అనుమతులపై దర్యాప్తు చేయాలన్నారు. ఎఫ్‌ఆర్‌కే బియ్యం పంపిణీలో అవకతవకలు, బస్టాండ్ బంద్ అవ్వడం, శ్మశానం అభివృద్ధి పనులు నిలిచిపోవడం కారణాలు తెలియాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణ, సామగ్రి పంపిణీలపై టెండర్లు జరగలేదన్నారు. నబరంగ్‌పూర్, ఉమ్మర్‌కోట్ మున్సిపాలిటీల్లో కొత్తగా ఏర్పాటు చేసిన లైట్లు పథకంపై టెండర్లు జరగలేదన్నారు. ఆరోపణలపై విజిలెన్స్ లేదా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న అర్జున్ త్రిపాఠి

విత్తనాలు, ఎరువుల విక్రయాల నిలిపివేత



మోడరన్ రైస్ మిల్లు గోదాంలో ఎరువులు నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: స్థానిక శ్రీకృష్ణా మోడరన్ రైస్ మిల్లు, గుడ్ల కృష్ణారావు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు నిలుపుదల చేయాలంటూ తనిఖీ అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కొత్తూరులోని శ్రీకృష్ణా మోడరన్ రైస్ మిల్లు, గుడ్ల కృష్ణారావు విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల దుకాణాలను శ్రీకాకుళం విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్ కుమార్, తాడేపల్లిగూడెంకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, జిల్లా నాణ్యత నియంత్రణ అధికారి ఎల్.మురళీధర్, స్థానిక ఏఓ శ్రీనివాసరావు కలిసి సంయుక్తంగా తనిఖీ చేశారు. సరుకులకు సంబంధించిన రికార్డులు, గోదాంలో ఉన్న నిల్వలను పరిశీలించారు. రూ.34 లక్షల వరకు తేడాలు ఉన్నట్లు గమనించి విక్రయాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. తేడాలు గుర్తించిన నిల్వలకు సంబంధించిన పత్రాలను స్థానిక ఏఓకు అందజేయాలని సూచించారు. పత్రాలు సమర్పించేంత వరకు సరుకులు విక్రయించకూడదని ఆదేశించారు.


అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అక్రమ ఇసుక తవ్వకాలను నిషేధించడానికి పెద్దఎత్తున పబ్లిసిటీ ఇవ్వాలని, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఆయా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల నివారణ కోసం నిర్దేశించిన టోల్ ఫ్రీ నంబర్లు, ఈ మెయిల్ ఐడీలను ఆయన తన ఛాంబర్‌లో శుక్రవారం సాయంత్రం మైన్స్ డీడీ సత్యనారాయణతో కలిసి విడుదల చేశారు. ఇసుక విషయంలో ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఫిర్యాదుల కోసం హెల్ప్ లైన్

సుప్రీంకోర్టు ఉత్తర్వులు అనుసరించి శ్రీకాకుళం జిల్లాలో అక్రమ ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై వచ్చే ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్, వాట్సాప్ నంబరు అలాగే ఈ మెయిల్ ఐడీలను ఇచ్చామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై టోల్ ఫ్రీ నంబర్ 1800-425-6012, ల్యాండ్ లైన్ నెంబర్ 08942-293229 లేదా 9701691657 నంబర్‌కు వాట్సాప్ ద్వారా, అలాగే ఈ మెయిల్ ద్వారా గానీ ఫొటోలు లేదా వీడియోలు సహాయంతో ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

మాజీ మంత్రి సురేంద్రనాథ్ నాయక్ కన్నుమూత



సురేంద్రనాథ్ నాయక్(ఫైల్)

భువనేశ్వర్: రాష్ట్ర మాజీ మంత్రి సురేంద్ర నాథ్ నాయక్ కనుమూశారు. ఆయన కాకత్‌పూర్ నియోజకవర్గం నుంచి వరుసగా 7 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మాజీ మంత్రి భౌతిక కాయానికి ఒడిశా అసెంబ్లీ ప్రాంగణంలో శుక్రవారం తుది వీడ్కోలు పలికారు. సురేంద్రనాథ్ నాయక్ భౌతిక కాయం శాసన సభ ప్రాంగణానికి చేరడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, స్పీకర్ సురమా పాఢి మరియు మంత్రి మండలి సభ్యులు నివాళులర్పించారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సురేంద్రనాథ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా రాష్ట్రంలో వివిధ రంగాల అభివృద్ధికి విశేష కృషి చేశారు. రాజకీయ, సామాజిక సేవారంగంలో ఆయన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు.



మాజీ మంత్రి సురేంద్రనాథ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న శాసనసభ్యులు



నివాళులర్పిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ



నివాళులర్పిస్తున్న మాజీ సీఎం నవీన్ పట్నాయక్

పశువుల నుంచి మనుషులకు..!

- జునోటిక్ వ్యాధులతో జాగ్రత్త
- పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానులు, రైతులకు సోకే అవకాశం
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ప్రమాదం
- రేబిస్, బర్డ్లూ, అంత్రాక్స్‌లది ఒకే కోవ
- నేడు ప్రపంచ జునోసిస్ దినోత్సవం



వేపాడ: పెంపుడు కుక్కలకు యాంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకా వేసేందుకు సిద్ధమైన పశువైద్యులు

పార్వతీపురంటౌన్/భామిని/వేపాడ: పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే స్వభావం ఉన్న వ్యాధుల్ని జునోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. సుమారు 200కు పైగా జునోటిక్ వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాధులు ఎక్కువగా పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, వ్యవసాయం చేసే రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శన శాలల సిబ్బంది, పరిశోధన శాలల్లో పనిచేసే సిబ్బందికి వస్తుంటాయి లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొట్టమొదటిసారిగా 1885వ సంవత్సరం జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తి ప్రాణాలను 'యాంటీ రేబిస్ టీకా' ద్వారా కాపాడిన సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీని 'జునోసిస్ డే' గా జరుపుకుంటున్నారు. జునోటిక్ వ్యాధులను వైరస్, బాక్టీరియల్, ప్యారసైటిక్‌లుగా విభజించారు. వైరస్ వల్ల సంక్రమించే వ్యాధులలో పిచ్చి కుక్కకాటు వ్యాధి (రేబిస్), మెదడువాపు వ్యాధి (జపనీస్ ఎన్సెఫలైటిస్), బర్డ్లూ ముఖ్యమైనవి. బాక్టీరియా వల్ల సంక్రమించే వ్యాధుల్లో బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోస్పైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం ముఖ్యమైనవి. పరాన్న జీవుల వల్ల సంక్రమించే వ్యాధుల్లో బద్దెపురుగులు, ఏలికపాములు, ఫైలేరియా హైడాటిడ్ వ్యాధులు ముఖ్యమైనవి. ప్రపంచ జునోసిస్ దినోత్సవం జంతువులు, మానవుల మధ్య వ్యాధుల వ్యాప్తిని నిరోధించడంలో మన ఉమ్మడి బాధ్యతను గుర్తుచేస్తుంది. వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలను తీసుకోవడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడడంతో పాటు మానవులు, జంతువుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.



భామిని:పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

పెంపుడు జంతువుల యజమానులకు సూచనలు

- పెంపుడు జంతువుల్లో ముఖ్యంగా రేబిస్ నివారణ కోసం టీకాలు సకాలంలో వేయించడం ముఖ్యం. పశువైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి.
- పెంపుడు జంతువులను, వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తర్వాత చేతులను శుభ్రంగా కడగాలి. లిట్టర్ బాక్సులు, పంజరాలను తరచూ శుభ్రం చేయాలి.
- బయట తిరిగే జంతువులకు క్రమం తప్పకుండా క్రిములను తొలగించాలి.
- పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూడడంతో పాటు, సరైన రక్షణ లేకుండా గాయపడిన అడవి జంతువులను రక్షించడానికి ప్రయత్నించవద్దు.
- అనారోగ్య లక్షణాలను గమనించాలి. ప్రవర్తన, ఆకలి, లేదా రూపంలో మార్పులను గమనించడం, ఏదైనా అసాధారణమైనది గమనిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.

పాడి రైతులకు..

బలమైన జీవభద్రతా చర్యలను అమలు చేయాలి. పశువుల దగ్గరకు అవసరమైన వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాద రక్షలు, రక్షిత దుస్తులను ఉపయోగించాలి. పశువులశాలలు, పాలు పిండే ప్రదేశాలు, పరికరాలను క్రమం తప్పకుండా శుభ్రంచేయాలి. పాలు పిండేటప్పుడు కఠినమైన పరిశుభ్రతా నియమాలను అమలు చేయాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలి. అనారోగ్యంతో ఉన్న జంతువులను వెంటనే మంద నుంచి వేరు చేయాలి.

18,380 యాంటీ రేబిస్ టీకాల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలలు, ప్రాంతీయ పశు వైద్యశాలలు, వెటర్నరీ పాలిక్లినిక్స్, వెటర్నరీ హాస్పిటల్స్ వద్ద ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశాం. ఇందుకోసం జిల్లాలో 18,380 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం చేశాం. జునోసిస్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల మనుషులు, జంతువులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రాణాంతక జునోసిస్ వ్యాధులపై సరైన అవగాహన ఉంటే చాలా వరకు అరికట్టవచ్చు. జునోసిస్ వ్యాధుల సంక్రమణ, నివారణపై అవగాహన కలిగించేందుకు ప్రాథమిక విద్య నుంచి ఆ వ్యాధులపై విద్యార్థులకు తెలియజేయాలి.

– ఎస్.మన్మథరావు,
జిల్లా పశు వైద్యశాఖాధికారి,
పార్వతీపురం మన్యం

కోళ్ల రైతులకు..

కోళ్లను పెంచే ప్రాంతాల్లో ప్రత్యేక దుస్తులు, పాదరక్షలను ఉపయోగించాలి. ఒకే వయస్సు ఉన్న పక్షులను కలిపి పెంచడం, గుంపుల మధ్య పూర్తిగా శుభ్రపరిచి, ఆ ప్రాంతంలో క్రిమిసంహార మందులు చల్లాలి. అడవి పక్షులతో సంపర్కాన్ని నివారించడానికి వలలు లేదా మూసివేసిన గూళ్లను ఉపయోగించాలి. ఆహారం తీసుకోవడంలో లేదా గుడ్ల ఉత్పత్తిలో తగ్గుదల వంటి అనారోగ్య లక్షణాలను గమనించడంతో పాటు, అసాధారణ మరణాలు లేదా లక్షణాలను వెంటనే పశువైద్య అధికారులకు తెలియజేయాలి. పక్షులు లేదా గుడ్లతో సంపర్కం తర్వాత చేతులను పూర్తిగా కడగాలి.

క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ



సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్, భక్తులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ అధికారిగా ఎంపిక



మణికృష్ణను అభినందిస్తున్న తల్లిదండ్రులు

పాలకొండ: పట్టణానికి చెందిన కె.మణికృష్ణ ఏపీపీఎస్‌సీ ఫలితాల్లో ఫారెస్ట్ రేంజ్ అధికారిగా జోన్-1కు ఎంపికయ్యారు. మణికృష్ణ తండ్రి జనార్దనరావు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా, యోగా గురూజీగా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. ఈ సందర్భంగా మణికృష్ణ మాట్లాడుతూ అటవీశాఖలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉందని తెలిపారు. అంకిత భావంతో విధులు నిర్వహించి మంచి పేరు సాధిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మణికృష్ణకు పలువురు అభినందనలు తెలిపారు.

కొండచిలువ హతం



గ్రామస్తులు హత మార్చిన కొండచిలువ

బొండపల్లి: మండలంలోని వెదురువాడ గిరిజన ప్రాంతంలో శుక్రవారం ఉదయం జనవాసాల మధ్యకు భారీ కొండచిలువ రావడంతో గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. దీంతో సుమారు 15 అడుగులు పొడవున్న భారీ కొండచిలువను హతమార్చి గ్రామానికి దూరంగా గల కొండ ప్రాంతంలో పూడ్చిపెట్టారు.

రైలు ఢీకొని వ్యక్తిమృతి



మృతుడు పోలీస్ (ఫైల్)

బాడంగి: పొలంపనుల కోసం రైల్వేట్రాక్ దాటి వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన మన్నెలపోలీస్(48) తన అల్లుడు భాస్కరరావు పొలంపనులకోసం వేకువజామున ఇంటివద్ద బయలు దేరి వెళ్తుండగా భీమవరం-బాడంగి లిమిట్స్ నక్కలచెరువు వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. దీంతో తల, కాళ్లకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అప్పమ్మ, శ్రావణి.సంధ్య అనే ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు రైల్వే పోలీసులు అప్పగించారు.

మేడపై నుంచి జారిపడి మహిళ..



కమ్మిండి సామాలమ్మ (ఫైల్)

గుర్ల: మండల కేంద్రానికి చెందిన కమ్మిండి సామాలమ్మ (44) మేడపై నుంచి జారిపడి శుక్రవారం మృతి చెందింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కమ్మింగి సామాలమ్మ తన ఇంటి మేడపైకి దుస్తులు ఆరవేయడానికి వెళ్లి పని పూర్తి చేసుకుని వస్తుండగా అకస్మాత్తుగా జారిపోయి కిందకు పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు గమనించి గుర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. కేంద్రాస్పత్రిలో చికిత్స చేస్తుండగా ఆమె మృతి చెందిందని వైద్యాధికారులు తెలిపారు. మృతురాలికి భర్త పైడప్పుడు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందకపోవడంతో సామాలమ్మ మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్

విజయనగరం అర్బన్: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులను పూర్తిగా అరికట్టాలని వేధించే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్ ఆదేశించారు. పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపుల చట్టం-2013 అమలుపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఆయన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా మహిళలపై వేధింపులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్థాయిలో అవగాహన కల్పించినప్పుడే ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలవుతుందని అభిప్రాయపడ్డారు. దీని కోసం అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో కృషి చేయాలని కోరారు. చట్టం అమల్లోకి వచ్చి సుమారు 11 సంవత్సరాలు పూర్తయినా ఇంకా అవగాహన స్థాయిలోనే ఉండడం విచారకరమన్నారు. చట్టం వల్ల తమకు రక్షణ లభిస్తుందన్న విషయం మహిళలకు తెలియాలని ఈ చట్టం వారికి ధైర్యాన్ని ఇవ్వాలని సూచించారు. చట్టాన్ని అమలు చేసేందుకు వివిధ కార్యాలయాల్లో ఏర్పాటైన కమిటీలు మరింత చురుగ్గా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదు చేయడమే కాకుండా కఠినంగా శిక్ష పడినపుడే వేధింపులు ఆగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

మహిళలు సురక్షితంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు అసంఘటిత రంగంలో కూడా చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలు, సురక్షితంగా భద్రంగా ఉండాలన్నది ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. స్థానిక, అంతర్గత కమిటీలు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేందుకు వారి పక్షాన నిలిచేలా చట్టం అమలు తీరు ఉండాలని ఆకాంక్షించారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు భారతీయ న్యాయ సంహితలో ఉద్దేశించిన వివిధ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓలు ఎంవీసూర్యకళ, ఎ.సాయిశ్రీ, బి.శాంతి, వివిధ శాఖల అధికారులు, సీడీపీఓలు, ఐసీడీఎస్ అధికారులు, వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు విజయలక్ష్మి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓల సమస్యలపై డీఈఓకు వినతి



ఎంఈఓల సమస్యలపై డీఈఓ పగడాలమ్మకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం

పార్వతీపురంటౌన్: ఎంఈఓల సమస్యలు పరిష్కరించాలని సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ-1 అసోసియేషన్ మన్యం జిల్లా నాయకులు ఎస్.నాగభూషణ రావు, డి.గౌరు నాయుడులతో కలిసి డీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్స్ గత ఏడాది నుంచి విడుదల చేయకపోవడం వల్ల ఆఫీస్ నిర్వహణ ఖర్చులు ఎంఈఓలే భరించాల్సి వస్తోందన్నారు. అందువల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. తమ సమస్యల పట్ల స్పందించిన డీఈఓకు ఎంఈఓ-1 అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలకు చేయూత అందించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు

పార్వతీపురం: మహిళలకు చేయూత నగదు రూ.18,750లు అందించాలని అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన మహిళలందరికీ చేయూత డబ్బులు రూ.18,750లు నాలుగో విడతలో విడుదల చేసిందని, అతి తక్కువ మందికి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యాయన్నారు. ఎక్కువ మంది మహిళలకు చేయూత డబ్బులు వారి ఖాతాలో జమ కాలేదని, అర్హులైన అందరికీ చేయూత డబ్బులు ఇప్పటి ప్రభుత్వం జమచేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ ఎ.వేణుగోపాలరావుకు వినతిపత్రం0అందించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు గెద్ద తులసి, బౌరోతు గౌరమ్మ, దాసరి మంగమ్మ, బెలగాం రమణమ్మ, విజయగౌరి, సీఐటీయూ పట్టణ నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి రెండేళ్ల జైలు

పాలకొండ: చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.రెండు లక్షల జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. బూర్జమండలం లచ్చయ్యపేటకు చెందిన గిరిడ చిన్నారావు రెండు లక్షల చెక్కును బొండపల్లి వెంకటరమణకు ఇచ్చాడు. చిన్నారావు ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో న్యాయం కోసం బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారణ చేసిన న్యాయమూర్తి చిన్నారావును దోషిగా నిర్ధారించి రూ.రెండు లక్షల జరిమానాతో పాటు, రెండు సంవత్సరాల జైలుశిక్ష విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల పాటు అదనంగా జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

ప్రైవేట్ సంస్థల్లో 850 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

పార్వతీపురంటౌన్: పార్వీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ సంస్థలలో 850 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వహీదా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8న పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. బీఎఫ్ఐఎల్ సినర్జీస్ క్యాపిటల్ లిమిటెడ్ యంగ్ ఇండియా టీమ్ లీజు పేటీఎం సంస్థలలో పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వివరించారు. 8వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఐటీఐ, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. 8వ తేదీన బయోడేటా, రెండు పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

10న ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు

పార్వతీపురంటౌన్: జిల్లాకేంద్రం పార్వతీపురం పట్టణంలోని ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్ చలపతిరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో నిట్, ఐసీఐసీఐ బ్యాంక్, డెక్కన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంక్, ఫాక్స్‌కాన్, అల్‌స్టామ్, దైకి అల్యూమినియం ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డిక్సాన్, హ్యుండాయ్ మోబీస్ అండ్ రాక్‌మెన్ ఇండస్ట్రీస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. రిలేషన్‌షిప్ మేనేజర్ ట్రైనీ, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ టెక్నిషియన్, క్వాలిటీ, ప్రొడక్షన్ అండ్ మెయింటనెన్స్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలోపు అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ. 12వేల నుంచి రూ.25వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ బుధవారం ఎస్‌వీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్, జిరాక్స్‌లతో హాజరు కావాలని సూచించారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- ఐటీడీఏ వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ నిరసన



ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు

పార్వతీపురంటౌన్: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌కు ఐదు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు గొర్లి వెంకటరమణ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌తో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆరోగ్య సేవలు అందిస్తూ పనిచేస్తున్న వారికి ఐదు నెలలుగా బకాయ వేతనాలు అందలేదన్నారు. గుర్తింపు కార్డులు యూనిఫాం ఇవ్వాలని అధికారులకు అనేక సార్లు విన్నవించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌డబ్ల్యూలను ఆశ కార్యకర్తలుగా మార్పుచేసి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి.ఇందిర, కుమారి, అప్పలనరసమ్మ, భారతి, జీవిత దమయంతి, దివ్య అరుణ, ధనలక్ష్మి, రజని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'గణిత శాస్త్రం' వెబ్‌నార్

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 'గణిత శాస్త్రం'పై జరిగిన అంతర్జాతీయ వెబ్‌నార్ ఆలోచింపచేసింది. తొలి రోజున నాన్ లీనియర్ అనాలసిస్, హ్యాథమెటికల్ అప్లికేషన్స్‌తో ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో జరిగిన ఈ వెబ్‌నార్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర మ్యాథ్‌మెటికల్ సొసైటీ ప్రెసిడెంట్, ఏయూ గణిత ప్రొఫెసర్ కేకేఎం శర్మ, ఉత్తరాంధ్ర మ్యాథ్‌మెటికల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.మీనాక్షి, సుందరం మెమోరియల్ సొసైటీ సెక్రటరీ, ఏయూ గణిత శాస్త్ర ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, జేఎన్‌టీయూ జీవీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య కె.బాబులు, సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల జాయింట్ సెక్రటరీ, కరస్పాండెంట్ పూజిత హాజరయ్యారు. వెబ్‌నార్‌లో రీసోర్స్ పర్సన్‌గా ఉత్తరాఖండకు చెందిన శ్రీదేవ్‌సుమన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అనిత తోమర్ ఫిక్స్ పాయింట్ థియరీ ఉపయోగించి స్టాక్ మార్కెట్ అనాలసిస్‌పై వివరించారు. జేఎన్‌టీయూ జీవీ విజయనగరానికి చెందిన గణితశాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ ఏవీ పాపారావు మ్యాథ్‌మెటికల్ మోడలింగ్ ఇన్ ఎకాలజీ అంశంపైన, ఏజీయూ నామినేటెడ్ సైంటిస్ట్ ఫర్ మిస్సీసీపీ ప్రొఫెసర్ రవి సదాశివుడు వివిధ రంగాలలో సాంకేతిక అభివృద్ధిలో గణిత శాస్త్రం పాత్రను తెలియజేశారు. ఏయూ గణితశాస్త్ర ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు ఫిక్స్ పాయింట్ అనువర్తనాలను సవివరంగా వివరించారు. ఈ సెమినార్లో దేశ విదేశాల నుంచి 250కి పైగా అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు పాల్గొన్నారని వెబ్‌నార్ కన్వీనర్ డాక్టర్ జి.శ్రీచందన తెలిపారు. వెబ్‌నార్ డైరెక్టర్‌గా డాక్టర్ కె.శ్రీలత, కో-కన్వీనర్‌గా వసంత వీచికలు వ్యవహరించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు.

మెగా డీఎస్సీ పేరిట ఫీజుల దగా

- టెట్ దరఖాస్తుల నెపంతో మోత
- రెండు మెథడాలజీలకు వేర్వేరుగా చెల్లింపు తప్పనిసరి
- ఒక్కో దరఖాస్తుకు రూ.750
- పెంచిన పోస్టులపై క్లారిటీ లేకుండా టెట్ నిర్వహణ
- లాంగ్వేజీ సబ్జెక్ట్‌లలో ఇంగ్లీషు, తెలుగుకు అదనంగా టెట్ నిబంధన
- లబోదిబోమంటున్న అభ్యర్థులు

రాజాం:

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకాకముందే రాష్ట్ర ప్రభుత్వం టెట్ పరీక్ష పేరుతో ఫీజుల దోపిడీకి తెర తీసింది. ఇదివరకు గత ప్రభుత్వం టెట్ నిర్వహించి, డీఎస్సీకి అంతా సిద్ధం చేయగా, మెగా డీఎస్సీ పేరుతో కొత్త ప్రభుత్వం గతంలో కంటే మరికొన్ని పోస్టులు ప్రకటించింది. పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దుచేసి ఆ స్థానంలో కొత్త డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వకుండా, కొత్తగా టెట్‌కు నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నిమిత్తం సిద్ధమైన అభ్యర్థులంతా కొత్త ప్రభుత్వ నిబంధనలతో డైలమాలో పడ్డారు. కొత్త డీఎస్సీ ఉంటుందో? లేదో? తెలియని అయోమయంలో ఉండగా, ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదలచేసిన టెట్‌కు మళ్లీ సన్నద్ధమవాల్సిన పరిస్థితి వచ్చింది.

వదలనున్న చేతిచమురు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టెట్ పరీక్షకు రాయాల్సిన అభ్యర్థులకు చేతిచమురు బాగా వదలనుంది. ఒక్కో పేపర్‌కు రూ.750 అభ్యర్థి చెల్లించాల్సి వస్తుంది. పేపర్-1(ఎ)లో 1 నుంచి 5 వతరగతి వరకూ బోధించే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల నిమిత్తం, పేపర్-1(బి)లో ప్రత్యేక అవసరాల పిల్లలు కలిగిన పాఠశాలల సెకెండరీ గ్రేడ్ టీచర్స్ నిమిత్తం ఫీజు చెల్లించాల్సి ఉంది. వీటికి డీఈడీతో పాటు స్పెషల్ డీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులు. పేపర్-2 (ఎ)లో ఒక విభాగంగా స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా, రెండో విభాగంలో సోషల్ స్టడీస్ ఇంకో సబ్జెక్ట్‌గా ఇచ్చి దరఖాస్తులు తీసుకుంటున్నారు. పేపర్-2(ఎ)లో మూడో విభాగంలో వరుసగా తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, ఒడియా, తమిళ, సంస్కృత భాషలతో పాటు ఇంగ్లీషు సబ్జెక్ట్‌కు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇక్కడే అసలు సమస్య మొదలైంది. తెలుగు, హిందీ భాషా పండిట్ ట్రైనింగ్ కళాశాలలో శిక్షణ పొందినవారికి ఈ లాంగ్వేజీ పండిట్ పోస్టులు రాసేందుకు టెట్ రాయల్సి ఉంది. అలా కాకుండా బీఈడీ శిక్షణ చేసే సమయంలో ప్రతి విద్యార్థి రెండు మెథడ్స్‌ను తీసుకుని శిక్షణ పొందుతారు. ఆ సమయంలో చాలామంది మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌తో పాటు తెలుగు, ఇంగ్లీషు మెథడ్‌ను రెండో ఆప్షన్‌గా తీసుకుని శిక్షణ పొందుతారు. వీరు ఇప్పుడు టెట్‌లో రెండు మెథడాలజీలకు సంబంధించి రెండేసి టెట్‌లు రాయాల్సి వస్తుంది. దీంతో వారంతా అదనపు ఫీజులు చెల్లించడంతో పాటు రెండు సబ్జెక్ట్‌లకు ఒకే దఫా టెట్ రాయాల్సి వస్తుంది. మ్యాథమెటిక్స్‌తో పాటు సైన్స్‌ను బీఈడీలో మెథడ్స్‌గా తీసుకున్న అభ్యర్థులకు ఈ సమస్య రావడం లేదని, కేవలం లాంగ్వేజీలను రెండో మెథడ్‌గా తీసుకున్న అభ్యర్థులకు మాత్రమే ఈ సమస్య వస్తోందని వాపోతున్నారు. ఒక వైపు టెట్ దరఖాస్తు ధర ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.750 ఉండడం, మరో వైపు ఒక్కొక్కరు రెండేసి సబ్జెక్ట్‌లకు దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుండడంతో ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. గతంలో ఇటువంటి సమస్య రాలేదని, ఈ సమస్యపై అధికారులు స్పందించి, ఒకే టెట్ అర్హతతో బీఈడీ అభ్యర్థులకు రెండేసి మెథడాలజీలకు వినియోగపడేలా అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

స్పష్టత లేకుండానే..

ప్రస్తుతం ఉపాధ్యాయ పోస్టులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 583 అసిస్టెంట్, 267 ఎస్జీటీ పోస్టులు ప్రకటించారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను సబ్జెక్ట్‌ల వారీగా ఇంతవరకూ ఇవ్వలేదు. దీంతో ఎన్ని పోస్టులు? ఏఏ సబ్జెక్ట్‌లకు ఉంటాయన్నది తెలియక అభ్యర్థుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ అసిస్టెంట్‌లలో పిజికల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజీ పండిట్‌లు పోస్టులు కొన్నింటిని కలపడం, ఇవి కాకుండా ప్రత్యేకంగా మళ్లీ పీఈటీ పోస్టులు, లాంగ్వేజీ గ్రేడ్-2 పండిట్ పోస్టులు చూపించడం అయోమయంగా మారింది. ఈ పోస్టుల్లో చాలామంది ఈ అకడమిక్ ఇయర్ చివరి నెలలో పదవీ విరమణ చేయబోతున్న వారి ఖాళీల ప్రకారం గుర్తించారని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీంతో ఈ మెగా డీఎస్సీ పేరులోనే తప్ప ప్రకటనలో లేనట్టు కనిపిస్తోందని సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది.

పురుగు మందుల దుకాణాలలో విజిలెన్స్ తనిఖీ



పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రామభద్రపురం: రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందించడమే లక్ష్యమని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్ తాతారావు, విజయవాడ వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ ఎ.డి ఆర్.గంగాధరరావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వాసవి విత్తనాలు, పురుగు మందుల దుకాణంలో శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో దుకాణంలో ఉన్న నిల్వలకు తగినట్లు రికార్డు నిర్వహణ లేకపోవడంతో పాటు కొన్ని రకాల విత్తనాలు, పురుగు మందులు నాసిరకంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే కాలపరిమితి దాటిన గుళికలు విక్రయిస్తున్నట్లు పసిగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అధికంగా రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేస్తారని, వారికి నాణ్యమైన సరుకులు అందించాలన్న ఉద్దేశంతో పురుగు మందుల షాపులను ఆయా మండలాల వ్యవసాయాధికారులతో కలసి తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ పురుగుమందుల దుకాణంలో నిల్వ రిజిస్టర్, అమ్మకం రసీదులు లేకుండా అక్రమంగా అమ్మకం చేస్తున్నట్లు తనిఖీలో గుర్తించామని తెలిపారు. రూ.1.84 లక్షలు విలువ చేసే 44.500 కేజీల విత్తనాలు, రూ.7.31 లక్షలు విలువ చేసే 914 కేజీలు పురుగు మందులు నాసిరంగా ఉన్నాయన్న అనుమానంతో సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రాథమికంగా గుర్తించిన పురుగుమందులు, విత్తనాలను పూర్తిగా నాణ్యతలేని సరుకులుగా నిర్ధారించేందుకు వ్యవసాయాధికారుల ద్వారా ల్యాబ్‌కు పంపిస్తున్నామని, పూర్తిగా నాణ్యత లేని ఎరువులుగా నిర్ధారణ అయిన తరువాత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక ఎ.డి శ్యామ్‌సుందర్, ఏవో వెంకటయ్య పాల్గొన్నారు.